క్లుప్తంగా

టీజీఓ జిల్లా అధ్యక్షుడిగా విఠల్



మెదక్‌జోన్: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ల (టీజీఓ) సంఘం జిల్లా అధ్యక్షుడిగా విఠల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం జనరల్ బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేసి అసోసియేషన్ నాయకులు జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా జిల్లా అధ్యక్షుడు విఠల్ మాట్లాడుతూ.. గెజిటెడ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తానన్నారు. తనను ఎన్నుకున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. జనరల్ సెక్రటరిగా నాగభూషణం, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా వేణుగోపాల్, మహేశ్, సౌజన్య తదితరులు ఎన్నికయ్యారు.

మృతుల కుటుంబాలకు పరిహారం అందజేత



శాంతికి చెక్కు అందిస్తున్న డీఈఈ చాంద్‌పాషా

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని గన్యాకు తండాకు చెందిన గూగ్లోత్ బన్యా, మాలోత్ చాంది కొద్దికాలం క్రితం విద్యుత్‌షాక్‌తో మృతి చెందారు. మంగళవారం మృతుడు బన్యా భార్య శాంతి, చాంది కుమారుడు కుమార్‌కు మెదక్ విద్యుత్ శాఖ కార్యాలయంలో డీఈఈ చాంద్‌పాషా షరీఫ్ రూ. 5 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 50 వేలు నగదు ఇచ్చి, మిగిలిన రూ. 4.5 లక్షలు ఫిక్స్ డిపాజిట్ చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో గన్యా తండా మాజీ సర్పంచ్ శంకర్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల వివరాల సేకరణ



గుజిరితండాలో ఉపాధి పనుల వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఆర్‌పీ జీవన్

చిలప్‌చెడ్(నర్సాపూర్): అర్హులైన ఉపాధి కూలీలు పనికి వెళ్తున్నారా.. చేసిన పనులకు సరైన డబ్బులు వచ్చాయా అంటూ తండావాసులను ఎస్‌ఆర్‌పీ జీవన్ ఆరా తీశారు. మంగళవారం ఆయన ఉపాధిహామీ సామాజిక తనిఖీలో భాగంగా మండలంలోని గుజిరితండాలో ఇంటింటికీ తిరుగుతూ ఉపాధిపనుల సమాచారాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఒక్కరూ ఉపాధిహామీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి పనులు చేసినప్పటికీ సక్రమంగా డబ్బులు పడని కూలీలు నరేగా అనే యాప్‌లో తాము చేసిన పని దినాలు, జాబ్‌కార్డు వివరాలు నమోదు చేయాలన్నారు. యాప్ గురించి పూర్తి వివరాలు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌పీ వీణ, వీఆర్‌పీ పల్లవి, తండావాసులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారుల నిరసన



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పెన్షన్‌దారులు

శివ్వంపేట(నర్సాపూర్): పెన్షన్ డబ్బులు సకాలంలో రాక ఇబ్బందులు పడాల్సి వస్తుందని లబ్ధిదారులు వాపోయారు. నెల వారీగా రావాల్సిన పెన్షన్ డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదని ఆరోపిస్తూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పెన్షన్‌దారులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. పోస్టాఫీస్ ద్వారా పలువురు లబ్ధిదారులకు పెన్షన్ డబ్బులు సకాలంలో వస్తున్నాయని ఇండియన్ బ్యాంకు ద్వారా రావడం లేదని వాపోయారు. ఈ విషయం గురించి పెన్షన్‌దారులు ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా దృష్టికి తీసుకెళ్లగా.. పెన్షన్ డబ్బులు ప్రభుత్వం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. నాలుగు రోజుల్లో పెన్షన్ డబ్బులు వస్తాయని సర్దిచెప్పారు.

ముమ్మరంగా వరి నారు తుకం వేసే పనులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు వరినారుతుకం వేసే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ వర్షాకాలం వర్షాలు సమృద్ధిగా కురవడంతో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో యాసంగి పంటలసాగుకు రైతులు వరి విత్తనాలను నానబెట్టి మొలక చేసి తుకం వేస్తున్నారు. తుకం వేయడం వల్ల ఇరవై రోజుల్లో నారు పెరిగి నాటుకు అనుకూలంగా ఉంటుందని ఏఓ స్వప్న తెలిపారు. చలినుంచి వరినారును రక్షించుకోవాలని తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఎమ్మెల్యే సునీతారెడ్డి



మహిళా సంఘాల సభ్యులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: ప్రభుత్వం ఇచ్చే రుణాలు సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అర్బన్‌డే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన మహిళలకు ప్రభుత్వం రుణాలు ఇస్తుందన్నారు. రుణాలు పొందిన మహిళలు వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో అనేక ప్రగతి కార్యక్రమాలు చేపట్టారని ఆమె గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇళ్లు లేని పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. పట్టణంలోని మహిళా సంఘాలకు రూ.ఒక కోటి 35లక్షల రుణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. మున్సిపాలిటీలో పనిచేసే పారిశుద్ధ్య సిబ్బందిని ఆమె అభినందించారు. ప్రతీ ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మున్సిపాలిటీ సిబ్బందికి అవసరమైన వైద్య పరీక్షలు చేసి మందులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహిపాల్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమొద్దీన్, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావు, మేనేజర్ మధుసూదన్, కౌన్సిలర్ రాంచందర్, మెప్మా పీడీ ఇందిర, వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సృజన పలువురు డాక్టర్లు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పలువురు దివ్యాంగులకు, మహిళలకు చెక్కులు అందజేశారు. అర్బన్‌డే సందర్భంగా పట్టణంలో అధికారులు, నాయకులు, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది సంయుక్తంగా పట్టణంలోని చౌరస్తా నుంచి పలు వీధుల గుండా ర్యాలీ చేపట్టి మున్సిపాలిటీ కార్యాలయం వరకు కొనసాగించారు.

పైలెట్ వార్డులో సర్వే పరిశీలించిన ఎమ్మెల్యే

నర్సాపూర్ మున్సిపాలిటీలోని ఐదవ వార్డును ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని ఇళ్లు లేని పేదల జాబితా రూపొందించేందుకు సర్వే చేపట్టింది. ఎమ్మెల్యే సునీతారెడ్డి పలువురు అధికారులు, నాయకులతో కలిసి ఐదవ వార్డులో సర్వే చేస్తున్న తీరును పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. సర్వే పకడ్బందీగా చేయాలని వారికి సూచించారు. తమకు సొంత ఇల్లు లేదని ఇళ్లు మంజూరు చేయించాలని పలువురు ప్రజలు ఎమ్మెల్యేను కోరగా, సర్వే అనంతరం నిరుపేదలకు ఇళ్లు వస్తాయని ఆమె చెప్పారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

నర్సాపూర్: పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే సునీతారెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. నర్సాపూర్‌కు చెందిన హసీనా, ముత్రాజ్‌పల్లికి చెందిన అశోక్‌గౌడ్, బ్రాహ్మణపల్లికి చెందిన లక్ష్మీనారాయణ, సత్యాగౌడ్, లచ్చయ్య, శివ్వంపేటకు చెందిన అంజాగౌడ్‌లకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఆమె వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులు నయిమొద్దీన్, సత్యంగౌడ్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి



విజేతలకు బహుమతులను అందిస్తున్న హెచ్‌ఎం నర్సింగం, ఐఈఆర్‌సీ ప్రతినిధులు



పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ వెంకటేశం

ఎంఈఓ యాదగిరి

నిజాంపేట(మెదక్): దివ్యాంగులు మనోధైర్యంతో అన్ని రంగాల్లో ముందుకుసాగాలని ఎంఈఓ యాదగిరి అన్నారు. మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశానికి మండల విద్యాధికారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైకల్యం అనేది మనం చూసే దృష్టిలో, ప్రవర్తనలో ఉంటుందని తెలిపారు. పిల్లలను వేరుగా చూడకుండా ప్రోత్సహించి అన్ని రంగాల్లో రాణించేలా చేయాలని చెప్పారు. గెలవలన్నా తపన, గెలవగలననే నమ్మకం ఉంటే జీవితంలో వైకల్యాన్ని జయించవచ్చని వివరించారు. నస్కల్ గ్రామంలోని అంగవైకల్యం ఉన్న విద్యార్థుల ప్రతిభను చూసి మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యంరెడ్డి, సాగరిక, ఉపాధ్యాయురాలు జఖియ, రాజాయ్య, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు క్రీడాపోటీలు

పెద్దశంకరంపేట(మెదక్): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పేటలోని ఐఈడీ కార్యాలయంలో దివ్యాంగ విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశం మాట్లాడుతూ.. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్వర్, విఠల్, సిబ్బంది సంపత్‌రెడ్డి, రాజు, రవికిరణ్ తదితరులున్నారు.

అండగా నిలవాలి

చిన్నశంకరంపేట(మెదక్): దివ్యాంగులకు అందరూ అండగా నిలవాలని ఎంఈఓ పుష్పవేణి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు. ఎంఈఓ విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

నార్సింగిలో ...

నార్సింగి జెడ్పీపాఠశాలలో దివ్యంగ విద్యార్థులకు ఫిజియోథెరపి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మురళిమోహన్, ఐఆర్‌టీపీ సుజాత, సౌజన్య, ఫిజియోథెరపి డాక్టర్ నర్సింహులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దినోత్సవం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నర్సింగం, ఐఈఆర్‌సీ ప్రతినిధులు రజని, శ్వేత ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు



తూప్రాన్: విజయోత్సవ ర్యాలీలో అధికారులు, నాయకులు

నర్సాపూర్ రూరల్: అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి, ప్రజాపాలన విజయోత్సవాల సమన్వయకర్త ఆంజనేయులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం నర్సాపూర్ పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి ఇతర నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న సందర్భంగా ఈ నెల 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాల పేరుతో ప్రజల్లోకి వెళ్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల కోసం పైలెట్ ప్రాజెక్టులో ఎంపికైన నర్సాపూర్ పట్టణంలోని ఐదో వార్డులో తిరిగి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, మండలాధ్యక్షుడు మల్లేశ్, నగేష్, పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, కపాచారి, రాధా కిషన్‌గౌడ్, అశోక్, సుధీర్‌గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు

తూప్రాన్: ప్రజాపాలన విజయోత్సవాలు మున్సిపల్ కేంద్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలకు ముఖ్యఅతిథిగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా బ్యూటీ పార్లర్‌ను ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్మికులకు మెగా వైద్య శిబిరం, తదితర సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఫార్మాసిస్టులు నైపుణ్యం పెంచుకోవాలి



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఫార్మసిస్టులతో అతిథులు, ఇతర ప్రతినిధులు

నర్సాపూర్: సర్టిఫికేషన్ కోర్సులతో ఫార్మాసిస్టులు నైపుణ్యాన్ని పెంచుకోవాలని తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ యోగానందం హితవు పలికారు. మంగళవారం వైపర్ కాలేజీలో ఏర్పాటు చేసిన నాల్గు రోజుల శిక్షణ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాజా పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. అమెరికాకు చెందిన మార్షల్ యూనివర్సిటీ అసోసియేట్ డీన్ నందిని మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరి/జ్ఞానాన్ని ఫార్మసిస్టులకు శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. వైపర్ కాలేజీ ప్రిన్సిపాల్ రమేశ్ మాట్లాడుతూ తమ కాలేజీలో శిక్షణ కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు లెక్చరర్లు పాల్గొన్నారు.

రసాయనాలు వినియోగిస్తే ముప్పు తప్పదు

కృషి విజ్ఞాన కేంద్రం తునికి శాస్త్రవేత్త డా.రవికుమార్



బండపోతుగల్‌లో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రవికుమార్

చిలప్‌చెడ్(నర్సాపూర్): సేంద్రియ వ్యవసాయం చేసి భూమిని కాపాడాలని, వ్యవసాయానికి అధిక మోతాదులో రసాయనాలు వినియోగిస్తే భవిష్యత్‌లో ముప్పు తప్పదని కృషి విజ్ఞాన కేంద్రం తునికి శాస్త్రవేత్త డా.రవికుమార్ అన్నారు. మంగళవారం ఆయన కేవీకే ఆధ్వర్యంలో పలు వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలసి మండలంలోని బండపోతుగల్ గ్రామంలో మండల రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంలో ముఖ్యంగా వరి కోతల అనంతరం మిగిలిన గడ్డి, వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా, వాటిని నేలలోనే మురిగేలా ఉంచాలన్నారు. జీవామృతం, ఘనామృతం, చీడపీడల నివారణకు పలు రకాల ఆకులతో తయారుచేసిన కాషాయాలను వినియోగించాలన్నారు. అనంతరం సైంటిస్ట్ డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ.. కేవీకేలో లభించే జీవన ఎరువులతో భూసారం పెరగడంతో పాటు, అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. రబీసాగులో నారుమడి యాజమాన్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సంగుపేట ఏరువాక శాస్త్రవేత్త సరిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. ఆశాలకు లెప్రసి, పల్స్‌పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించిన తర్వాతనే కొత్త సర్వేలు చేయించాలన్నారు. కొన్నాళ్ల నుంచి ఆశా సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌ఎస్‌ఎం మల్లీశ్వరికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా సిబ్బంది నిర్మల, వెంకట్‌లక్ష్మి, మంజుల, లక్ష్మి, లావణ్య, తదితరులు ఉన్నారు.

వేతనం అందించాలి

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల వేతనం అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలోని పీహెచ్‌సీ ఎదుట ఆశ వర్కర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఆదివారం సెలవు ఇవ్వడంతో పాటు ప్రసూతి సెలవులు అందించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశ వర్కర్లకు న్యాయం చేయాలన్నారు. అనంతరం సీహెచ్‌ఓ యాదగిరిరావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు దేవమ్మ, నాగమణి, ఊర్మిళ, కవిత, బుజ్జి, లలిత, సంతోష తదితరులు పాల్గొన్నారు.

నార్సింగిలో ఆశ వర్కర్ల ధర్నా

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆశా వర్కర్లు ధర్నాను నిర్వహించారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి ఆధ్వర్యంలో పీహెచ్‌సీ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లగా తీసుకునేందుకు నిరాకరించారని బాలమణి తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ఇక ముందు ఎలాంటి సర్వేలు చేయబోమని తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



చిన్నశంకరంపేట పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు



శివ్వంపేట(నర్సాపూర్): వినతిపత్రం ఇస్తున్న ఆశా సిబ్బంది

జిల్లా గెజిటెడ్ ఆఫీసర్ సంయుక్త కార్యదర్శిగా బాలనర్సయ్య



మనోహరాబాద్(తూప్రాన్): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోషియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నికల్లో భాగంగా జిల్లా సంయుక్త కార్యదర్శిగా పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాలనర్సయ్య నియమాకమయ్యారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెజిటెడ్ అధికారుల సమస్యలకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనకు అవకాశం ఇచ్చిన ముఖ్య అతిథి రాష్ట్ర టీజీఓ అధ్యక్షుడు శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా కమిటీకి, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కృత్రిమ గర్భధారణ చేయించాలి

మండల పశువైద్యాధికారి రాజు



రైతులకు అవగాహన కల్పిస్తున్న రాజు

కౌడిపల్లి(నర్సాపూర్): మేలుజాతి పశువులకోసం కృత్రిమ గర్భధారణ చేయించాలని మండల పశువైద్యాధికారి రాజు తెలిపారు. మంగళవారం మండలంలోని వెంకట్రావ్‌పేటలో జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గేదెలు, ఆవులు ఎదకు రాగానే పశువైద్యసిబ్బంది, గోపాల మిత్రలకు సమాచారం ఇచ్చి, కృత్రిమ గర్భధారణ చేయించాలని చెప్పారు. దీంతో మేలుజాతి దూడలు పుడుతాయని చెప్పారు. మేలుజాతి గేదెలు, ఆవులు పాలు అధికంగా ఇస్తాయని దీంతో రైతుల పాడిపరిశ్రమ బాగుపడి ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. పశువైద్య శిబిరంలో పశువులకు కృత్రిమ గర్భధారణతో పాటు నట్టల నివారణ, గర్భకోశ వ్యాధులు, సాధారణ వ్యాధులకు చికిత్సలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ చెన్నయ్య, ఎల్‌ఎస్‌ఏ వీరారెడ్డి, గోపాల మిత్ర సూపర్‌వైజర్ సత్యనారాయణ, గోపాల మిత్రలు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ఆపరేటర్‌ను నియమించాలి

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండల వనరుల కేంద్రానికి ఎంఐఎస్ కంప్యూటర్ ఆపరేటర్, మెసెంజర్‌ను నియమించాలని తపస్ జిల్లా బాధ్యులు రంగారెడ్డి, మండల అధ్యక్షుడు భద్రయ్య మంగళవారం కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన మండలానికి నెల రోజుల క్రితం ఎంఈఓ అధికారిని నియమించారని తెలిపారు. కానీ సిబ్బంది లేకపోవడంతో ఉపాధ్యాయులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ సుభాస్‌రెడ్డి



పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి రామచంద్రాచారి ఆధ్వర్యంలో దేవేందర్ స్వామి నివాసంలో అయ్యప్ప పడిపూజ చేశారు. 18 మెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు.

ఎమ్మెల్సీ వ్యవసాయ క్షేత్రంలో..

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని కూచన్‌పల్లిలో ఎమ్మెల్సీ శేరి సుభాస్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం అయ్యప్పపడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ పట్టణంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి అయ్యప్పస్వాములు పెద్ద ఎత్తున తరలివచ్చి అయ్యప్పస్వామి భక్తి పాటలతో భజనలు చేశారు. అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ప్రభుత్వ పథకాలపై కళాజాత

కౌడిపల్లి(నర్సాపూర్): తెలంగాణ సంస్కృతి సారధి కళాబృందం ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై కళాజాత ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక బస్టాండ్ వద్ద కళాబృందం టీంలీడర్ సిద్ధులు ఆధ్వర్యంలో గ్రామస్తులు, ప్రయాణికులకు ప్రభుత్వ పథకాలపై పాటద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు నర్సింలు, ఎల్లం, ఎల్లం, మాధవి, లక్ష్మి, కృష్ణ, శేఖర్, దాసు తదితరులు పాల్గొన్నారు.

◆ మాసాయిపేట మండల నూతన బీజేవైఎం కమిటీ ఎన్నిక

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండల నూతన బీజేవైఎం అధ్యక్షుడిగా విఠల్ ఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రంలో నూతన బీజేవైఎం కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు మండల బీజేపీ అధ్యక్షుడు వేణుగోపాల్ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా సాయితేజ, బూత్ కమిటీ అధ్యక్షులుగా రాములు, సాయి, సురేశ్‌లను ఎన్నుకున్నామన్నారు.

◆ విరాళం అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో గౌరీశంకర్ నివాసంలో గురుస్వాములు అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. ఆలయం వద్ద స్వాముల కోసం వసతులకు దాత మాజీ సర్పంచ్ నవీన్‌గుప్తా రూ.50 వేల నగదుని అయ్యప్ప స్వాములకు అందజేశారు. గురుస్వాములు నాగయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, రాజు, సాయి, లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

◆ గ్రంథాలయానికి ఫర్నిచర్

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలోని గ్రంథాలయంలో చదువుకుంటున్న వారికోసం ఫర్నిచర్‌ను గ్రామానికి చెందిన భాస్కర్‌యాదవ్ మంగళవారం అందజేశారు. గ్రంథాలయానికి అవసరమైన వస్తువులు, కిటికిలకు గ్రిల్స్, పోటీపరీక్షలకు అవసరమైన పుస్తకాలు, కుర్చీలు, ప్యాడ్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పీఈటీ గోవర్ధన్, కానిస్టేబుల్ సురేశ్, యువకులు అజయ్‌కుమార్, సురేష్‌కుమార్‌లు, గణేశ్‌గౌడ్, భిక్షపతి, చిన్నయాదవ్, సతీష్‌యాదవ్ పాల్గొన్నారు.

◆ కార్మికులకు రక్త పరీక్షలు

టేక్మాల్(మెదక్): మండలంలోని ఎల్లంపల్లి గ్రామంలో ఏఐటీసీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు మంగళవారం రక్త పరీక్షలు నిర్వహించారు. లేబర్ కార్డు ఉన్నవారికి టెస్టులు చేసి, వైద్య సిబ్బంది కృష్ణ, వేణు సాంపుల్ తీసుకువెళ్లినట్లు తెలిపారు.

◆ కేజీబీవీలో నైట్ వాచ్‌ఉమెన్‌కు దరఖాస్తు

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని కేజీబీవీలో రాత్రి కాపలాదారు(మహిళ)కు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి సత్యనారాయణరావు మంగళవారం తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు 18 నుంచి 45 ఏళ్ల నిండి ఉన్న మహిళలు మాత్రమే అర్హులన్నారు.

◆ రామాయంపేటలో శ్రీకాంత్‌చారికి నివాళి

రామాయంపేట(మెదక్): తెలంగాణ ఉద్యమంలో ఆత్మ బలిదానం చేసుకున్న శ్రీకాంత్ చారి వర్ధంతిని మంగళవారం పట్టణంలో నిర్వహించారు. స్వర్ణకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్‌చారి ఆధ్వర్యంలో సంఘం సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం పట్టణాధ్యక్షుడు రామకృష్ణచారి, గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రవీందర్, కోశాధికారి వేణు, తదితరులు పాల్గొన్నారు.

◆ ఎమ్మెల్యేను విమర్శించే స్థాయికాదు

నిజాంపేట(మెదక్): మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావును విమర్శించే స్థాయి బీజేపీ జిల్లా ఇన్‌చార్జి విజయ్‌కుమార్‌కు లేదని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల మాజీ సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షుడు అమరసేనారెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యేను కించపరిచేలా మాట్లాడినందుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేశం, మారుతి, నసీరొద్దీన్, మహేందర్, ముత్యంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, మధుసుదన్ రెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ అంకిత భావంతో విధుల నిర్వహించాలి

శివ్వంపేట(నర్సాపూర్): విధులపై అంకిత భావంతో పనిచేయాలని ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి సూచించారు. శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా నియమితులైన ఐదుగురు కానిస్టేబుల్స్ విధుల్లో చేరారు. మంగళవారం ఈ సందర్భంగా వారికి ఎస్‌ఐ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ దేవదాస్, నూతనంగా నియమితులైన కానిస్టేబుల్స్ ఉష, యాదగిరి, సుధాకర్, హరీశ్, మైపాల్, తదితరులు ఉన్నారు.